

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:10(3), October, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# ప్రేమ్‌నగర్

డా. ఎ. సునీత,
అసోసియేట్ ప్రొఫెసర్
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్),
బేగంపేట.

**ఉపోద్ఘాతం :** ప్రేమ్‌నగర్ నవల కోడూరి కౌసల్యాదేవి గారు రచించిన నవలలో ప్రసిద్ధమైనది. ఈ నవల తెలుగులో చలన చిత్రంగా రూపొందించబడి అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులో కౌసల్యాదేవి గారు ఉద్యోగాలు చేస్తున్న మహిళలు అటు కుటుంబంలోను, ఇటు సమాజంలోను ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చించారు. ఈ క్రమంలో కౌసల్యాదేవి గారు చర్చించిన మహిళా సమస్యలను అందించిన మహిళాభ్యుదయ భావనలను పరిశీలించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

ప్రేమ్‌నగర్ నవలలో ఇతివృత్తం జమీందారీ కుటుంబ వ్యవస్థకు సంబంధించింది. జమీందారీ కుటుంబానికి చెందిన యువకుడు అధికార పూర్వక పలకరింపులు, మర్యాదలతో ఆప్యాయతానురాగాలు కరవై, దురలవాట్లకు బానిసైన స్థితిలో, అతని వద్ద ఉద్యోగం నిమిత్తం వచ్చిన మధ్యతరగతి యువతి, అతనికి కరవైన ప్రేమ, ఆప్యాయత, ఆదరణల నందించి, సంస్కారవంతునిగా తీర్చిదిద్ది, జీవితపు విలువలను తెలియపర్చిన వైనాన్ని ఈ నవలకు వస్తువుగా స్వీకరించింది రచయిత్రి. ఈ క్రమంలో ఉద్యోగ నిర్వహణలో ఒక స్త్రీ ఎదుర్కొనే ఇబ్బందులు కనిపిస్తాయి.

కళ్యాణవర్మ వద్ద పర్సనల్ సెక్రటరీగా ఉద్యోగంలో చేరిన లత అంతక్రితం ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తుంది. లత కుటుంబ ఆర్థిక స్థితి దిగజారడంతో ఉద్యోగం చేయడానికి సంసిద్ధురాలయినపుడు వారి తల్లిదండ్రుల వ్యతిరేకత గురించి జయప్రదాదేవికి చెపుతున్న సందర్భంలో "ఆడపిల్ల ఉద్యోగం చెయ్యడ మేమిటని పట్టుబట్టారు, ఏడ్చారు. కాలం మారుతుందని నచ్చజెప్పి నేనే ఆ ఉద్యోగంలో చేరాను. నా నడత ఎప్పటికీ సరిగానే ఉంటుందని ఎవరికీ అవమానం కలిగించే పనులేవీ చేయననీ హామీ ఇచ్చి" ఉద్యోగం చేరాను (పు. 67) అని చెపుతుంది. కుటుంబ పోషణకు తన వంతు సహకారం అందించాలని భావించే ఆడ పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వలేని కుటుంబ వ్యవస్థకు నిదర్శనం ఈ సన్నివేశం. అంతేగాక ఉద్యోగాలు చేసే స్త్రీల నడత సరిగా ఉండదనే దురభిప్రాయం సమాజంలో ఎంత బలంగా వ్యాపించి ఉందో తెలుస్తుంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:10(3), October, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఎయిర్ హోస్టెస్ గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన లతకు ఆ ఉద్యోగంలో మనశ్శాంతి కరవు అవుతుంది. రకరకాల వ్యక్తులతో మసలాల్సి రావడం, వారు చెప్పినట్టు వినకపోతే ఇష్టంలేని ట్రిప్పులతో దూర దూరాలకు పంపించడం చూసి విసిగిపోయి ఆ ఉద్యోగాన్ని మానుకుంటుంది. కళ్యాణవర్మ వద్ద పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్నపుడు ఆమెకు ఇబ్బందులు తప్పవు. ఒకసారి ఆలస్యంగా వచ్చిన లతతో ఆమె తల్లి "ఎంత ఉద్యోగమైతే మాత్రం మరీ రాత్రింబవళ్ళు అక్కడే సేవా? ఆడపిల్లవు కూడాను. ఆ మాత్రం జ్ఞానం ఉండక్కరలేదూ? చిన్న జమీందారుతో విచ్చలవిడిగా తిరుగుతున్నావని తలకొక రకంగా వ్యాఖ్యానిస్తుంటే వినలేక నా తల భూమిలోకి క్రుంగిపోతోంది. ఆడదాని ఇటువంటి సంపాదన తిని బ్రతికే కంటే కట్టగట్టుకు గంగలో దూకడం నయం" (పు. 105) అన్న మాటలను పరిశీలించినపుడు, ఆడపిల్లలు శీలం గురించి జాగ్రత్తగా ఉంటామని ఎన్ని ప్రతిజ్ఞలు చేసి ఉద్యోగాలలో చేరినా వారిపై అనుక్షణం అపనమ్మకం ఏర్పరచుకుంటారని, తమ పెంపకంపై తమకే నమ్మకం పోయి బయటి వ్యక్తుల అభిప్రాయాలకు, కుటుంబ సభ్యుల అభిప్రాయాలకు బేధం లేకుండా పోతుందని తెలుస్తుంది. ఆడపిల్ల సంపాదనపై చులకన భావాన్ని ప్రతిబింబిస్తుంది ఈ సన్నివేశం. అందుకే లత తల్లి ఆమెతో "కొడుకులు ఆ ప్రయోజకులైన పోబట్టి ఇన్ని పాట్లొచ్చాయి" అంటూ బాధపడుతుంది. ఈ సందర్భంలో లత తన తల్లితో "కొడుకులు ఆ ప్రయోజకులైపోయారని ఏడుస్తున్నావా? కూతురు ప్రయోజకు రాలైందని ఏడుస్తున్నావా? లెక్కలూ, కాగితాలూ చూచి చూచి తగవులు తీర్చి తీర్చి అలసి చచ్చి వస్తే ఇదా నాకెదురైన హారతి? ఛీఛీ ఏం లోకం! అక్కడ పని చేసిన చోట మెప్పూ పేరూలేదు. ఇక్కడ తెచ్చి పెట్టే చోట తృప్తి సంతోషమూ లేదు. ఇంకెందుకు? ఎవరికోసం నా జీవితం? ఎక్కడ చూచినా నాకు నిష్టూరాలూ, అసూయలూ, నిందలూ. ఎక్కడ ప్రేమించి ఆదరించే వాళ్ళు లేరు. ఛీ ఉద్యోగం చేసే అవివాహితురాలి పాట్లు పగవాడిక్కూడా వద్దు. అక్కడికి ఇంట్లో కూర్చున్న వాళ్ళంతా మహా పతివ్రతలలాగా ఉద్యోగాలు చేసే వాళ్ళ మీద నానా నిందలు వేస్తారు. అదే మగవాడినైతే బాధ్యతలు గుర్తెరిగి తల్లిదండ్రులకు సాయపడుతున్నాడని పగలు కురిపిస్తారు. ఏం లోకం! ఇంకా ఎన్నేళ్ళు పోయినా ఈ దేశంలో నాలాంటి ఆడదానికింతకంటే గౌరవ మన్ననలు దక్కుతాయా?" అంటూ తన బాధ వ్యక్తం చేస్తుంది. లత అన్న ఈ మాటలు ఉద్యోగాలు చేసే ఆడపిల్లల మానసిక సంఘర్షణకు అద్దం పడుతున్నవి. తమ స్థానంలో మగపిల్లలు ఉద్యోగం చేసి కుటుంబానికి తోడ్పడితే బ్రహ్మరథం పట్టే సమాజం, కుటుంబం, కేవలం ఆడపిల్లలుగా ఆ బాధ్యతను నెత్తిన వేసుకున్నందున అపనిందల పాలు చేసి అవమానించడం సంస్కృతిగా మారిన వైనాన్ని నిరూపించింది ఈ సన్నివేశం.

ఎస్టేట్‌లో పెద్ద జమీందార్ కేశవవర్మ తాగిన మైకంలో లతపై బలాత్కారం చేయబోతాడు. ఆ సందర్భంలో తనను తాను రక్షించుకుంటుంది. ఈ సందర్భంలో లత కళ్యాణవర్మతో "మగవాడి దగ్గర ఉద్యోగం, ఎప్పుడే పరిస్థితి ఎదురౌతుందోనని ఆత్మరక్షణార్థం, శీల రక్షణార్థం ఎప్పుడూ ఈ పిస్టల్‌ను దగ్గరుంచుకుంటున్నాను. అంతేకాదు నాశనమే నా ముఖాన వ్రాస్తే ప్రపంచం నుండి, అవమానాల నుండి శాశ్వతంగా, ప్రశాంతంగా నిష్క్రమించడానికి ఈ సైనేడ్ సీసా, ఈ రెండింటి ధైర్యంతోనే మీ జమీ భవనాలలో ఇంత నిర్భయంగా తిరుగుతున్నాను" (పు. 112) అంటుంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:10(3), October, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లైంగిక వేధింపులు, ఇటీవలి కాలంలో ఉద్యోగాలు చేసే స్త్రీల సంఖ్య అధికం కావడంతో ఈ సమస్య భిన్నరూపాలలో ఆడవాళ్ళ పాలిట శాపంలా పరిణమించింది. అందుకే భారత ఉన్నత న్యాయస్థానం ఆగస్టు 13, 1997 నాడు “ పనిచేసే చోట లైంగిక వేధింపుల” పై చేర్చాల్సిన అంశాలను సుస్పష్టంగా వివరించింది.

అవి :

1. శారీరక సంబంధం లేదా చొరవ
2. లైంగికపరమైన కోరిక లేదా ఒత్తిడి
3. లైంగికపరమైన రంగుల ప్రదర్శన
4. అశ్లీల చిత్రాల్ని, దృశ్యాల్ని ప్రదర్శించడం
5. మరే ఇతరమైన అంటే లైంగికంగా, అసభ్యకరమైన శారీరక, మౌఖిక, సంజ్ఞా ప్రదర్శన.

పై వాటిలో ఏ ఒక్క అనుచితమైన ప్రవర్తన ఉన్నా లైంగిక వేధింపుగా గుర్తించాల్సి ఉంటుంది. 1970లో రచింపబడిన ప్రేమ్‌నగర్ నవలలో కౌసల్యాదేవి స్త్రీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే లైంగిక వేధింపుల గురించిన స్పృహను వ్యక్తం చేయడం విశేషం. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా ఆమె రెండు మార్గాలను సూచించింది. ఒకటి లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిని హత్య చేయడం – రెండు, లైంగిక వేధింపు ఎదుర్కొనే స్త్రీ తానే ఆత్మహత్య చేసుకోవడం. అందుకే లత సైనేడ్ సీసా, పిస్తోలు సహాయంతో ఉద్యోగం చేస్తున్నానని చెపుతుంది. కౌసల్యాదేవి సూచించిన రెండు మార్గాలలో ఒకటి న్యాయ సమ్మతమైందే. వ్యక్తి ఆత్మరక్షణలో భాగంగా ఎదుటి వ్యక్తిని చంపినా చట్టం దానిని నేరంగా పరిగణించదు. కానీ, చట్టం దృష్టిలో ఆత్మహత్య చేసుకోవడం నేరం. అయితే కౌసల్యాదేవి ఆత్మహత్యను పరిష్కార మార్గంగా సూచించడాన్ని నిశితంగా పరిశీలించినపుడు మన సమాజంలో శీలం చెడిపోయిన ఆడదాన్ని సానుభూతితో అర్థం చేసుకునే పరిస్థితులు లేవు. ఆడదానికి ప్రాణం కన్నా శీలం విలువైనదనే భావజాలాన్ని పెంచి పోషించింది పితృస్వామ్య సంస్కృతి. అందుకే ఈ సమస్యను అధిగమించడానికి ఆత్మహత్య పరిష్కార మార్గంగా కౌసల్యాదేవి సూచించడం జరిగింది. అయినా ఇది హేతు బద్ధమైంది కాదు.

ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ కూడా సమర్థవంతంగా తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తుంది లత. అందుకే జయప్రదాదేవి లతతో “ఒక జమీందారు బిడ్డను, మరొక జమీందారు గృహిణిని కాని ఇంతవరకు నీ వంటి విశ్వాసపాత్రులైన ఉద్యోగులను పుట్టినింట గాని, మెట్టినింట గాని చూడలేదు. డబ్బు తింటారు గాని, యజమాని బాగు గురించి ఆలోచించేవారు, శ్రద్ధచేసి ఇలా మంచి మార్గానికి మళ్ళించి తీర్చిదిద్దేవారు కూడా ఉంటారని ఇప్పుడు నిన్ను చూచే తెలుసుకున్నాను. చినబాబు దుర్వ్యసనాలిలా ఇంత తేలికగా వదిలిపోతాయని కాని, ఇంత గుణవంతుడై నలుగురి చేతా సెభాష్ అనిపించుకుంటాడని గాని నేను కలలోనైనా అనుకోలేదు. ఇదంతా నీ చలవ” (పు. 105) అంటూ అభినందనలు తెలుపుతుంది.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:10(3), October, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కేవలం ఉద్యోగ నిర్వహణకే కట్టుబడక నైతిక విలువలకు ప్రాముఖ్యతను ఇచ్చి, జీవితంలో వాటికి గల ప్రాధాన్యతను తెలియజేసి, యజమాని సత్ప్రవర్తనకు, కార్మిక, శ్రామిక ఐక్యతకు కారణంగా నిలుస్తుంది. మరోవైపు అవివాహితగా ఉండి కుటుంబ బాధ్యతలను నిర్వర్తించి తన నిస్వార్థతను, ఔన్నత్యాన్ని నిరూపించుకుంది లత. మొత్తం మీద ఈమె పాత్ర ద్వారా కౌసల్యాదేవి స్త్రీలు ఉద్యోగ రంగంలో కానీ, కుటుంబం బాధ్యతల నిర్వహణలో గానీ నైతిక విలువలకు ప్రాధాన్యత నిచ్చి తమ త్యాగనిరతిని, ఔన్నత్యాన్ని చాటుకుంటారని నిరూపించింది.

**ఆధార గ్రంథాలు**

1. కోడూరి కౌసల్యాదేవి – ప్రేమ్‌నగర్ నవల
2. పనిచేసే చోట ప్రవర్తనా నియమాలు – (అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రచురణ)